ప్రజాశక్తి

శుక్రవారం 20 డిసెంబర్ 2024 8 పేజీలు




గుంటూరు పల్నాడు

రీ సర్వేకు మళ్లీ కసరత్తు

- గ్రామాల వారీగా బృందాల ఏర్పాటు
- 160 రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం
- మండలానికి ఒక్క గ్రామం చొప్పున 14 ఎంపిక
- రాజధాని ప్రాంతానికి మినహాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను తిరిగి కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. తొలి విడతగా జిల్లాకు 14 గ్రామాలను ఎంపిక చేశామని సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టరు ఎ.పవన్ కుమార్ తెలిపారు. త్వరలో రీ సర్వే ప్రక్రియ తిరిగి ప్రారంభం అవుతుందన్నారు. రీసర్వే కోసం ఎంపిక చేసిన గ్రామాలు.. లచ్చన్నగుడిపూడి (తాడికొండ మండలం), మందపాడు (మేడికొండూరు), వడ్డమాను (తుళ్లూరు), జడవల్లి (పొన్నూరు), పేరికలపూడి (దుగ్గిరాల), మంచాల (చేబ్రోలు), పాండ్రపాడు (కాకుమాను), మెరికపూడి (ఫిరంగిపురం), మల్లాయపాలెం (ప్రత్తిపాడు), అనమర్లపూడి (పెదకాకాని), చినపలకలూరు (గుంటూరు పశ్చిమ), పెదరావూరు (తెనాలి), జొన్నలగడ్డ (గుంటూరు తూర్పు), కుంచవరం (కొల్లిపర) గ్రామాలను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి సర్వే బృందాలను ఎంపిక చేస్తున్నారు.



గత ప్రభుత్వ హయాంలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న అప్పటి గుంటూరు జిల్లా జెసి (ఫైల్)

ఒక్కో గ్రామంలో 200 నుంచి 250 ఎకరాలను తొలుత సర్వే చేయాలని నిర్ణయించారు. రోజుకు కేవలం 20 ఎకరాలను మాత్రమే సర్వే చేయాలని ప్రతిపాదించారు. సర్వేలో తొలి విడతగా ప్రభుత్వ భూములు, చెరువు, పోరంబోకు భూములు, అసైన్డు వివరాలను కూడా నమోదు చేస్తారు. ప్రధానంగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, చెరువు, కుంటలు, పోరంబోకు భూములు ఎక్కడ ఉన్నాయి? ఈ భూములు ఎవరి అధీనంలో ఉన్నాయి? ప్రభుత్వం ఎవరికి పంపిణీ చేసింది? ఎవరు అనుభవిస్తున్నారు? అనే వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రెవెన్యూ అధికారులు తొలుత ఈ సమాచారం నమోదు చేసిన

▶ 2లో



పరిశ్రమల ముఖ్యకార్యదర్శి యువరాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, కార్మికులు

పరిశ్రమల ముఖ్యకార్యదర్శి వద్దకు ఎసిసి కార్మికులు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో కలిసి సమస్యలపై విన్నపం

ప్రజాశక్తి-తాడేపల్లి

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజన్‌ను ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో కలిశారు. సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్ట్, హైకోర్టు ఇచ్చిన ఆర్డర్లను వినతి పత్రం ద్వారా ఆయన అందజేశారు. 2014లో కోర్టు ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం కార్మికులకు యజమానులు రూ.42 కోట్ల 93 లక్షల 61 వేల 817 చెల్లించాలని, వాటితోపాటు 12 శాతం వడ్డీ కలిపి ఇవ్వాలని, అది కూడా రెండు నెలల్లో చెల్లించాలని తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీలో 333 మంది కార్మికులు ఉండగా అందులో సగం మందికి పైగా అనారోగ్యం, అర్ధాకలితో చనిపోయారని, ఒకప్పుడు ఎంతో ఘనంగా బతికిన కార్మికులు నేడు ఆర్థిక భారంతో, కుటుంబ పోషణ కోసం తమకు నైపుణ్యం లేని పనులకు వెళ్తున్నారని తెలిపారు. ఎసిసి పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ పిఎఫ్, పెన్షన్ తదితర కార్మికులకు రావాల్సిన న్యాయమైన డిమాండ్లపై హెచ్‌ఎంటి తరపున ఎం.బాలాజీ సంతకాలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఇప్పటికైనా న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్రస్థాయిలో అన్ని ప్రజాసంఘాలను కూడగట్టి పోరాటం ఉధృతం చేస్తామని

▶ 2లో

వణికిస్తున్న వాయుగుండాలు

జిల్లాలో ఒక మోస్తరుగా వర్షం జల్లులు - పెరిగిన చలితీవ్రత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర రూపం దాల్చడంతో గురువారం తెల్లవారుజామున గుంటూరు,పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. అల్పపీడనం బలపడి క్రమంగా వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోయడానికి సిద్ధంగా ఉన్న వరి రైతులు ఈ సమయంలో వర్షం వల్ల పంట మొత్తం దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికిప్పుడు వరి కోతలు చేయవద్దని జిల్లా అధికారులు రైతులకు సూచించారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 40 శాతం విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. జనవరి 15 వరకు కోతలు ముమ్మరంగా కొనసాగనున్నాయి. ప్రస్తుతం తుపాను ప్రభావం తొలగిపోయే వరకు వరికతోలను వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ. భార్గవ తేజ కోరారు. శుక్ర, శనివారాల్లో జిల్లాలో ఒకమోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాలతో వరి, పత్తి, అపరాల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అల్పపీడనం వాయుగుండంగా మారి గుంటూరు, పల్నాడు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ జిల్లా అధికారులు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఒక వైపు చలికాలం, మరో వైపు అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత కొన్ని రోజులుగా చలితీవ్రత పెరుగుతోంది. గత రెండు నెలలుగా బంగాళాఖాతంలో వరసుగా ఏర్పడుతున్న వాయుగుండాల ప్రభావంతో ఈ

▶ 2లో

తాడేపల్లిలో..



అమరావతిలో..



గుంటూరులో..



అంబేద్కర్‌పై అమిత్‌షా

అనుచిత వ్యాఖ్యలకు నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి, గుంటూరు జిల్లా ప్రతినిధి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, పిసిసి అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం పలుచోట్ల నిరసనలు జరిగాయి. ఇందులో భాగంగా తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా రామారావు మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలులో రూ.వేల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన ఆదానిని వెనకేసుకొచ్చి, పార్లమెంట్లో ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక చర్చను పక్కదారి పట్టించడానికి ఈ మార్గం ఎంచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని చెప్పారు. హోంమంత్రి వ్యాఖ్యలను ప్రధానమంత్రి సమర్ధించడం సిగ్గుచేటన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ మొదటి నుండి రాజ్యాంగం పట్ల వ్యతిరేకంగా ఉన్నాయని, మనువాద రాజ్యాంగని తీసుకురావడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలకు బిజెపి తిలోదకాలు ఇస్తోందన్నారు. ప్రజల సమస్యలు చర్చకు రాకుండా పక్కదారి పట్టించడానికి ఇటువంటి మార్గం ఎంచుకోవడంలో బిజెపికి మించినవారు ఎవరు లేరని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.వెంకట్‌రెడ్డి, పి.కృష్ణ, వి.దుర్గారావు, కె.కరుణాకర్‌రావు, బి.దశరథరామిరెడ్డి, ఎస్‌కె.బాష, ఎల్.సత్యం, దేవకుమార్, కె.మేరీ, డివి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. గుంటూరులోని ఆనంద్‌పేట వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట, లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేద్కర్‌ని అవమానించిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోడీ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పిసిసి అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బిజెపి అహంకారానికి నిదర్శనమన్నారు. భారత రాజ్యాంగానికి ఇది ఘోర అవమానమని చెప్పారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్నారు. లాడ్జి సెంటర్ వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయకుమార్, నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, బిళ్లా సునిల్, రాచకొండ జాన్‌బాబు, పాలపటి అనిల్, కట్ట జవహర్‌బాబు, వాల్మీకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శంకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తెగిన తీగ తగిలి యువకుడు మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మైనార్టీ తీరకుండానే కుటుంబ భారాన్ని మోసుకొస్తున్న యువకుడు విద్యుత్ తీగలకు బలయ్యాడు. విద్యుద్ఘాతంతో మైనర్ అయిన భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో గురువారం జరిగింది. పట్టణంలోని పెద్ద చెరువులో కలెక్టర్ బంగ్లా ముందు విద్యుత్ మెయిన్ లైన్ వైరు తెగిపడింది. సమీపంలో నివసించే ఇర్ల శంకర్ (17) ఉదయాన్నే అటుగా వచ్చాడు. అయితే తెగిపడి ఉన్న తీగను చూడక దానికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లి, తమ్ముడు, నాయమ్మ పోషణ భారాన్ని శంకర్ తన భుజాన వేసుకున్నాడని, ఆ కుటుంబానికి ఆధారమైన, ఎంతో భవిష్యత్ ఉన్న యువకుని మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ ఎఈ ప్రకటించిన రూ.5 లక్షలు నష్టపరిహారం సరిపోదన్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సిఐ పి.హైమారావు తెలిపారు.



యేసు మృతదేహం.. తల వెనకభాగంలో అయిన గాయం

దహనక్రియలకు వెళ్లిన విఆర్ఎ శ్మశానంలో మృతి

ప్రజాశక్తి చేబ్రోలు

మండల కేంద్రమైన చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు (విఆర్ఎ) కారుమూరి యేసు (59) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిసిందని తహశీల్దార్ కె.శ్రీనివాసశర్మ చెబుతుండగా స్థానికులు మరోవిధంగా చెబుతున్నారు. గ్రామానికి చెందిన ఒకరు చనిపోవడంతో దహన క్రియలు నిర్వహించేందుకు శ్మశానానికి యేసు వెళ్లాడని, అక్కడే ఆయన చనిపోయాడని, తలపై భారీ గాయం ఉందని అంటున్నారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. విఆర్ఎ మృతిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.వెంకటకృష్ణ తెలిపారు. మృతునికి భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు.



విఆర్ఎల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు విఆర్ఎలు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు బంగిసాహెబ్ మాట్లాడుతూ తమకు పే స్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలకు గ్రేడ్ వన్ వీఆర్వోగా ప్రమోషన్లు ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలగా గుర్తించాలని కోరారు. ఇటీవల అమరావతి మండలం పెదమద్దూరు వీఆర్ఏ మేకల ప్రేమ్ కుమార్‌ను సస్పెండ్ చేశారని, అతన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవడానికి ఆర్‌డిఒతో మాట్లాడాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.సంజీవరావు, రవి, మునాఫ్, బ్రహ్మయ్య, సుందర్రావు, ఆంజనేయులు, కాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - తుళ్లూరు: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వైసిపి మండల మాజీ



అధ్యక్షులు బత్తుల కిషోర్ కోరారు. గురువారం స్థానిక కన్యకా పరమేశ్వరి సత్రంలో వైసిపి కార్యకర్తల సమావేశం జరిగింది. కిషోర్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు నిస్తేజం వీడి పార్టీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. వైసిపి మండల, గ్రామ కమిటీల ఎంపిక జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా వజ్రబాబుకు పంపాలని సూచించారు. ఈనెల 21న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ప్రతి గ్రామంలో నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయుడు నాగేశ్వరరావు, కాకర్ల నాగేశ్వరరావు, కంతేటి వెంకటేశ్వర్లు, మిట్టనోసల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ : గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సత్తెనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. సైబర్ నేరాలపై అన్ని విద్యా సంస్థలలో, గ్రామాల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. గ్రీవెన్స్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - దాచేపల్లి

అధికారులు సమావేశానికి రాకుంటే ఆయా శాఖలకు సంబంధించిన విషయాలను తాము ఎవర్ని అడగాలని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. గత మూడు నెలలు, రానున్న మూడు నెలల్లో అభివృద్ధి పనులు, ప్రణాళిక రూపకల్పనపై చర్చించాల్సిన సమావేశానికి 28 శాఖల అధికారులు హాజరవ్వాల్సి ఉన్నా వారెందుకు రాలేదని పలువురు ప్రశ్నించారు. అభివృద్ధి పనులు, వివిధ శాఖల్లో లోటుపాట్లపై ఎలా చర్చించాలని అన్నారు. ఎంపిడిఒ పి.రామకృష్ణ సమాధానమిస్తూ గైర్హాజరైన అధికారులకు నోటీసులిచ్చి తదుపరి సమావేశానికి హాజరయ్యేలా చూస్తామని చెప్పారు. వివిధ అంశాలపై ఎంపిపి కె.జాను మాట్లాడారు. మండల వైద్యాధికారి అమూల్య, గృహ నిర్మాణ ఎఇ వై.ప్రవీణ్ కుమార్, ఎఈ సోమయ్య, సూపరిటెండెంట్ రత్నం, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలుచోట్ల సెమీక్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే గల్లా మాధవి, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, డిప్యూటీ మేయర్ షేక్.సజీలా, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం ఆదర్శమని అన్నారు. క్రిస్మస్ వేడుకల ద్వారా ఏసుక్రీస్తు సందేశాన్ని నేటి తరానికి తెలియచేయటం జరుగుతుందన్నారు. కమీషనర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం త్యాగాల మయమని ఆయన ప్రజల పాపాల ప్రక్షాళనకు ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తమ విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించటమే ప్రజలకు సేవ చేయటం అన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, బిషప్ జోహన్‌బాబు, పాదర్లు శామ్యూల్‌జాన్, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

స్థానిక 21వార్డు, ఎన్టీఆర్ కళాక్షేత్రం, సత్తెనపల్లి



మండలం పాకాలపాడులో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు వై.రామస్వామి, సి.హెచ్.శ్రీనివాసరావు, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

ఎంపిడిఒ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ ఏసురత్నం సందేశం ఇచ్చారు. ఎంపిడిఒ హేమలతాదేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్ హుస్సేన్, పి.దయాసాగర్, మాధవి, శశికళ, సాయి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల ముఖ్యకార్యదర్శి వద్దకు ఎసిసి కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామనని యువరాజ్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, నాయకులు కె.ఆదినారాయణ, బి.అంకయ్య, వై.సాంబయ్య, ఎం.ఆశీర్వాదం, వై.యెహోషువా, బి.సూర్య ప్రకాష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 16 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో శంషుద్దీన్, రామారావు, బి.నవనీతం, వి.లక్ష్మి, ఎస్కే ఇస్మాయిల్ కూర్చున్నారు. రమాదేవి, దుర్గ భవాని, రిబ్కా, సాంబశివరావు, శారద, సారమ్మ, హిమంబి, శివమ్మ , అన్నమ్మ పాల్గొన్నారు.

బృందాలు ఆయా భూ యజమానులకు ముందుగా నోటీసు ఇవ్వడం, భూ యజమానితో పాటు ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడం, గ్రామంలో ఉన్న రైతులందరికి కలిపి వాట్సాప్ గ్రూపు రూపొందించడం, తహశీల్దార్, సర్వేయర్లు గ్రామాన్ని సందర్శించి గ్రామాన్ని 200 నుంచి 250 ఎకరాలను బ్లాక్‌లుగా విభజించి ప్రతి గ్రామానికీ నాలుగు బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో మొత్తం 17 మండలాలు ఉండగా తాడేపల్లి, మంగళగిరి మండలాలను మినహాయించారు. ఈ మొత్తం కార్పొరేషన్ పరిధిలోకి చేర్చడం వల్ల కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు సర్వే చేస్తారు. అంతేగాక రాజధాని ప్రాంతం సిఆర్‌డిఎ పరిధిలో ఉండటంతో ఈ మండలాలను మినహాయించారు.

రీ సర్వేకు మళ్లీ కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

తరువాత సర్వేకు సంబంధించి రైతులకు సమాచారం ఇవ్వాలి.

జిల్లాలో మొత్తం 173 గ్రామాలు ఉండగా గత ప్రభుత్వ హయాంలో 62 గ్రామాల్లో సర్వే పూర్తయింది. 64 గ్రామాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. గతంలో గ్రామసభలు నిర్వహించి సర్వే వివరాలను రైతులకు వివరించి వారితో లిఖితపూర్వకంగా వివరాలు తీసుకుని నమోదు చేశారు. అప్పట్లో అనేక వివాదాలు రావడంతో ప్రస్తుతం సర్వేలో వివాదాల పరిష్కారం దిశగా నిర్వహించాలని నిర్ణయించారు. అందువల్ల రోజుకు గరిష్టంగా 20 ఎకరాలను మాత్రమే ఎంపిక చేశారు. దాదాపు 160 రోజుల పాటు సర్వే చేసేందుకు ప్రభుత్వం అధికారులకు గడువు ఇచ్చింది. సర్వే ప్రారంభంకుముందే స్థానిక రైతులకు పూర్తి సమాచారం ఇవ్వడం, దండోరా, టాంటాం ద్వారా ముందస్తుగా తెలియజేయడం, వారి వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వివరాలను సరిచూసుకుని హక్కుపత్రాలను నిర్ధారించనున్నారు. వివాదాలు వస్తే మొబైల్ మేజిస్ట్రేట్‌తో పాటు వివిధ హోదాల్లో ఉన్న ఉన్నతాధికారులకు కూడా భూ యజమానులు ఫిర్యాదు చేయవచ్చు.

సర్వేకు సంబంధించి ఒక్కో బృందంలో ఇద్దరు విలేజ్ సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ సహాయకుడు (విఆర్ఏ) ఉంటారు. ఇదేవిధానంతో నాలుగు బృందాలను నియమిస్తారు. ఒక బృందం భూ యజమానులకు, ప్రభుత్వానికి మధ్య సమాచారం అందిస్తారు. ప్రతి రోజు ఒక బృందం 20 ఎకరాల వరకు సర్వే చేస్తుంది. సర్వే

వణికిస్తున్న వాయుగుండాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏడాది డిసెంబరు రెండో వారం నుంచే చలి తీవ్రత పెరిగింది. గత నాలుగు రోజులుగా ఉదయం 9 గంటల వరకు సూర్యుడు కన్పించకుండా ఎటుచూసినా మబ్బులు కన్పిస్తున్నాయి. జాతీయ రహదారిపై మంచు వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలుకూడా కనబడక డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. చలి వల్ల చిన్నారులు, వృద్ధులు ఉదయాన్నే బయటకురావడానికి ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు మఫలర్లు, స్వెట్టర్లు ధరించినా చలికి తట్టుకోలేకపోతున్నారు. మంచువల్ల క్రీడాప్రాంగణాల్లో వాకర్స్ సంఖ్య తగ్గుతోంది. మంచులో బయటకు రావడం వల్ల వృద్ధులకు ఆరోగ్య సమస్యలు వస్తుండటంతో చాలా మంది బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 10 గంటలకు మంచు కురవడం ప్రారంభం అవుతోంది. ఉదయాన్నే పొలాలకు వెళ్లే వ్యవసాయకార్మికులు, ఉద్యోగాలకు వెళ్లే వారు మంచులోనే పలు జాగ్రత్తలతో తరలి వెళ్లడం కనిపించింది. మంచులో తిరగడం వల్ల నుమోనియా రోగులకు, పిల్లలకు ఆస్మా సమస్యవస్తోందని చెబుతున్నారు. చలి తీవ్రత, పొగ మంచుతో పాటు జిల్లాలో మధ్యాహ్నం వరకు చాలా ప్రాంతాల్లో ఎండ రాకుండా మూగ ఎండ కాస్తోంది. ఉదయం వేళ ఉష్ణోగ్రతలు 26 డిగ్రీలుగా నమోదు అవుతున్నాయి. రాత్రి వేళ 20నుంచి 23 డిగ్రీల వరకు నమోదు అవుతోంది. చలి తీవ్రత పెరగడంతో చాలా మంది వృద్ధులు,పిల్లలు ఆస్మా తదితర వ్యాధులతో బాధపడే వారికి మరింత ఇబ్బంది కరంగా మారింది. శ్వాసకోశ సమస్యలు మరింత పెరుగుతున్నాయి.



పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మహేశ్వరి బంధువులతో మాట్లాడుతున్న ఎస్ఐ

సాగర్ కుడికాల్వలో నర్సు మృతదేహం

కనిపించకుండాపోయి శవమై తేలిన వైనం

కారకులను కఠినంగా శిక్షించాలంటూ బంధువుల ఆందోళన

ప్రజాశక్తి- మాచర్ల



కీర్తి మహేశ్వరి (ఫైల్)

పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న వివాహిత కనిపించకుండా పోయి నాగార్జునసాగర్ కుడి కాల్వలో శవమై తేలిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణంలోని రోప్‌లైన్ కాలనీలో నివాసం వుంటున్న పాలకీర్తి మహేశ్వరి(20) పట్టణంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో నర్సుగా పనిచేస్తుంది. గత శనివారం నుండి మహేశ్వరి కనిపించకుండా పోవటంతో భర్త అజయ్‌కృష్ణ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. మహేశ్వరి మృతదేహం బుధవారం నకరికల్లు మండలం చేజర్ల వద్ద సాగర్ కుడి కాల్వలో కనిపించింది. మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. మహేశ్వరి కారంపూడి వద్ద కాల్వలో దూకినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మహేశ్వరి మృతి పై విచారణ చేసి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ బంధువులు పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. పోలీసుల హామీతో బంధువులు ఆందోళన విర మించారు. అనుమానస్పద మృతికింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద మృతదేహం

ప్రజాశక్తి - దాచేపల్లి

పట్టణంలోని నడికూడి గ్రామం నుండి గోగులపాడు గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్న నడికుడి జంక్షన్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడికి సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చేపలమ్ముకునే మహిళ గుడిసె దగ్ధం

దుండుగులు తగులబెట్టారని బాధితురాలు ఫిర్యాదు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని టీజంక్షన్ సమీపంలో చేపలు అమ్ముకునే నిరుపేద మత్యకారుణి గుడిసెను గుర్తుతెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి తగులబెట్టారు. విజయపురి సౌత్ కు చెందిన ఎరిపల్లి బంగారమ్మ గత సంవత్సర కాలంగా సాగర్ టీ జంక్షన్ సమీపంలో గుడిసెలో చేప ముక్కలు వేపుడు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. బుధవారం అర్ధరాత్రి బంగారమ్మ గుడిసె దగ్ధం అవుతుండటం అక్కడ హైవే రహదారి పనులు చేసే కూలీలు గమనించారు. మంటలు ఆర్పే లోపే గుడిసె పూర్తిగా కాలి బూడిదైంది.రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మత్యకారుల సంఘం అధ్యక్షుడు ఎరిపల్లి వేంకటేశ్వర్లు గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితురాలు బంగారమ్మ ను పరామర్శించారు.విషయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా బాధితురాలికి హామీ ఇచ్చారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల వద్దకే వచ్చి వారి భూసమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అన్నారు. గురువారం గుంటూరు శివారులోని, అంకిరెడ్డి పాలెంలో రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్‌డిఓ కె.శ్రీనివాసరావుతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని రెవెన్యూ రికార్డులు , 1బి రిజిస్టర్‌తో సరిపోల్చి చూసి వారి దరఖాస్తులపై రిమార్కులు నమోదు చేసి వాటిని ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధి లోపు వాటిని పరిష్కరించడం జరుగుతుందని పిటీషన్ దారులకు కలెక్టర్ భరోసా కల్పించారు.ఈనెల 6 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా రీసర్వే , అడంగల్‌లో మార్పులు చేర్పులు , సర్వే నెంబర్లు సరి చేయడం, ఆర్.ఎస్.ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు విక్రయాల అనంతరం పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుండి తొలగించిన వాటి వివరాలు తెలుసుకోవడానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.ఈ సదస్సుల్లో 56 సర్వీసులు ఉచితంగా ప్రజలు పొందవచ్చున్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు ,ఏఎస్ఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలకు బీమా చేయించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు : రబీలో పంటలసాగు చేస్తున్న రైతులందరూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ ఏ.భార్గవతేజతో కలిసి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ప్రదానమంత్రి ఫసల్ బీమాయోజనలో నామ మాత్రంగా 0.3 శాతం ప్రీమియం చెల్లించి నమోదు అయ్యేందుకు 2024 డిసెంబరు 31 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో జొన్న పంటకు ఎకరాకు రూ. 48లు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.114లు, పెసలు ఎకరాకు రూ.45, మినము ఎకరాకు రూ.50, శనగ ఎకరాకు రూ.70లు చెల్లించి, పంటల బీమాలో నమోదు చేసుకోవచ్చున్నారు. సమావేశంలో డిఆర్ఓ ఖాజావలి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో 179 ఫిర్యాదులపై కమిటి సభ్యులు విచారణ జరిపి, వైద్యసేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని, పేషెంట్లకు నగదు రహిత వైద్యసేవలు అందించాలని ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వైద్యసేవా, ఇహెచ్ఎస్ పేషెంట్లకు నగదు రహిత వైద్యం అందేలా అన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరం సేవలలో వైద్యులు తప్పని సరిగా అందుబాటులో ఉండేలా చూడాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఇహెచ్ఎస్ పథకం కింద ఉద్యోగులు, పెన్షనర్లు ఆసుపత్రులకు వచ్చినప్పుడు వైద్య సేవలు తిరస్కరించకుండా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిజిహెచ్‌లో వైద్య సేవలు పొందే ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం రోగులను ఆసుపత్రికి అనుసంధానం అయిన సెంటర్లకే పంపాలని, రోగులకు ఎలాంటి డబ్బులు ఖర్చుకాకుండా పరీక్షలు, మందులు అందించాలన్నారు. ఒమేగా హాస్పిటల్, కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్‌లో పరీక్షలకు, వైద్యానికి రోగుల నుంచి వసూలు చేసిన డబ్బులను వెంటనే తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. ప్రైవేటు మెడికల్ షాపులలో కొన్న మందులకు రసీదులు ఇస్తున్నారా లేదా అని వాకబు చేసి, అన్ని ప్రైవేటు మందుల షాపులు రసీదులు ఇచ్చే విదంగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్‌పై వచ్చిన ఫిర్యాదుకుగాను హాస్పిటల్ యాజమాన్యం, రోగి కుటుంబ సభ్యుల సమక్షంలో విచారణ జరపమని కమిటీ సభ్యులను ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎం.మజీదబి, డాక్టర్ సిహెచ్.విజయప్రకాష్ పాల్గొన్నారు.



పులిపాడులో కలెక్టర్, ఎస్పీ పర్యటన

సిఎం రాక సందర్భంగా ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్టీఆర్ భరోసా పింఛనును లబ్ధిదార్లకు నేరుగా పంపిణీ చేసేందుకు గురజాల మండలంలోని పులిపాడుకు సిఎం చంద్రబాబు ఒకటో తేదీన రానున్న నేపథ్యంలో గ్రామంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, జెసి సూరజ్ గనోరే గురువారం పర్యటించారు. సభాస్థలం, హెలీప్యాడ్ ఏర్పాటుకు గ్రామం నలువైపులా అనువైన స్థలాలను పరిశీలించారు. సిఎం పర్యటన రోజు వాహనాల ట్రాఫిక్, పార్కింగ్ అంశాలపై చర్చించారు. దైదబిలంలోని అమరలింగేశ్వర స్వామి ఆలయాన్ని సిఎం సందర్శించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మురళి, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, డీఎస్పీ జగదీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సదస్సులో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

డీకే పట్టాలున్నా రైతులపై అటవీశాఖ కేసులు

తాళ్లచెరువు, చెరుకుంపాలెంలో పేద రైతుల సమస్యలపై రెవెన్యూ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - అచ్చంపేట

తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలో 1993 సంవత్సరంలో తాళ్లచెరువు, కొత్తపల్లి, చెరుకుంపాలెం గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలకు డీకే పట్టాల మంజూరు చేశారని, అయితే గతేడాది నుండి రైతులను అటవి శాఖాధికారులు ఇబ్బందులు గురిచేస్తూ కేసుల నమోదు చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. ఈ సమస్యను రెవెన్యూ, అటవీశాఖాధికారులు సమన్వయంతో పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులో అధికారులను కోరారు. ఈ మేరకు తాళ్లచెరువు గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సమస్యను రవిబాబుతోపాటు రైతు సంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, కె.గోపీకృష్ణారెడ్డి వివరించారు. సర్వే నంబర్ 314 నుండి 331 వరకు 30 ఏళ్ల క్రితం సుమారు వందమందికి డీకే పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఇటీవల భూముల రీ సర్వే పేరుతో అటవీ శాఖాధికారులు 1992 రికార్డు ప్రకారం అటవీ భూమని సాగు చేసుకుంటా రైతులపై కేసు నమోదు చేశారని తెలిపారు. అందులో కొందరు సాగు చేసుకుంటున్న, పట్టాలు ఇవ్వలేదని మరికొందరికి ఆన్‌లైన్‌లో అడంగల్‌లో ఉన్న వాటిని 22ఎ నిషేధిత జాబితాలో చేర్చారని, మరికొందరిని అటవీ శాఖ అధికారులు భూములోనికి రానివ్వడం లేదని చెప్పారు. దీనిపై చెరుకుంపాలేనికి చెందిన 18 మంది రైతులు, తాళ్లచెరువుకు చెందిన 16 మంది రైతులు వినతిపత్రం అందించారు. ఈ సమస్యను పరిష్కరించేంత వరకూ తాము నష్టపోకుండా, సాగుకు అవకాశం రైతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారి వైఎస్ రత్నం, వీఆర్వో శేషయ్య, సర్వేయర్ యు.ఏడుకొండలు, టిడిపి నాయకులు జి.ఇన్నారెడ్డి, టి.వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆర్.జోజి, కె.రాజా పి.వెంకటేష్, వై.మర్రెడ్డి, వై.బాల్రెడ్డి, అఖిల్‌రెడ్డి, కె.ఆంజనేయులు పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహ పాదాలను అమిత్‌షా పట్టుకోవాలి

- మనువాద భావజాలంతో ఆయన వ్యాఖ్యలు
- మంత్రివర్గం నుండి తొలగించాలి
- కేంద్ర హోం మంత్రి క్షమాపణలు చెప్పాలని నిరసనలు

ప్రజాశక్తి - అమరావతి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై పల్నాడు జిల్లాలోని పలుచోట్ల నిరసన తెలిపారు. ఇందులో భాగంగా అమరావతిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో నిరసనలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ గురించి మాట్లాడే బదులు హిందూమతంలో ఉన్న ఒక దేవుడిని స్మరించుకుంటే స్వర్గం వస్తుందంటూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని విమర్శించారు. అమిత్‌షా ఎంపీగా, మంత్రిగా భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేశారని, దేశ సమైక్యతకు, ప్రజల స్వేచ్ఛకు హాని తలపెట్టకుండా రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటానని ప్రమాణం చేశారని గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతోనే ఆయన ఆ వాఖ్యలు చేశారన్నారు. ఆయన్ను మంత్రి పదవి నుండి తొలగించాలని, పార్లమెంట్లో అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో ప్రజా సంఘాల కన్వీనర్ బి.సూరిబాబు ఎంఆర్‌పిఎస్ నాయకులు దాసు, వైసిపి నాయకులు టి.సూరిబాబు, డి.ప్రసాదు, కెవిపిఎస్ నాయకులు రాజ్‌కుమార్, మురహరి, మొహిద్దీన్‌వలి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు హేయమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.జాన్‌పాల్ అన్నారు. నరసరావుపేట పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. జాన్‌పాల్ మాట్లాడుతూ అంబేద్కర్ మరణించి



68 ఏళ్ల గడుస్తున్నా నేటికీ అంబేద్కర్ పేరు తలుస్తుంటే ఓర్వలేని ప్రజాప్రతినిధులు ఉండడం దేశ ప్రజల దౌర్భాగ్యమన్నారు. అమిత్ షా తక్షణమే అంబేద్కర్ విగ్రహ పాదాలు పట్టుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను సమర్థించిన మోడీకి, వారు వారు ప్రాతినిధ్యం వహించే మతత్వ బిజెపికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. అనంతరం రోడ్డుపై బైఠాయించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ సంఘాల నాయకులు యుజయరావు, షేక్ మౌలాలి, రమాదేవి, సయ్యద్ షకీలా, ఎం.సాంబశివ, రమేష్, యు.శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రజా సంఘాల నాయకులు



డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగానే దేశంలోని అన్ని వ్యవస్థలూ నడుస్తున్నాయని, వాటిలో కొన్నింటికి బాధ్యత వహిస్తున్న హోం మంత్రి ఇలా మాట్లాడ్డం దారుణమని అన్నారు. అమిత్‌షా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన బిజెపి నాయకుడు కనుకనే ఇలా వ్యాఖ్యానించారని విమర్శించారు. నాయకులు బి.శ్రీనునాయక్, పి.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, ఎస్.నాగరాజు, బి.రాంబాబు నాయక్, బి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేష్ నాయక్, పి.చిన్న, వెంకట బుల్లోడు, బి.పృథ్వీ, కె.హనోక్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసనలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, నాయకులు ఎం.ప్రసన్న, షేక్ బాజీ మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యలు దేశ ప్రజలనే అవమానపరిచేలా ఉన్నాయని, ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఆయన పదవికి రాజీనామా చేయకుంటే భర్తరఫ్ చేయాలన్నారు. అనంతరం అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అనిల్ కుమార్, స్వప్న కుమార్, బాషా, వెంకటరత్నం, శ్యాంబాబు పాల్గొన్నారు.

వానకు ముద్దయిన ధాన్యం

ప్రజాశక్తి - దాచేపల్లి

స్థానిక మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం వానబారిన చిక్కుకుంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ ధాన్యంలో తేమశాతం తగ్గాక అమ్ముకోవడానికని స్థానిక మార్కెట్ యార్డులో ఆరబోసుకున్నారు. మరికొందరు బస్తాల్లో నిల్వ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడవగా ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసింది. కొంతమేరైనా కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. దీనిపై మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి స్పందిస్తూ మండలం వ్యాప్తంగా 600 ఎకరాల్లోనే వరి సాగైందని, మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న



ధాన్యం చాలా వరకు పక్క మండలాల్లోని రైతులు, మిల్లలర్లు, వ్యాపారులకు చెందిందని చెప్పారు. వర్షానికి ధాన్యం తడిసిన నేపథ్యంలో దాన్ని తేమశాతం 17 వరకు ఉన్నా కొనుగోలు చేస్తామని చెప్పారు.

అదానీకి లాభాల కోసం జనాలపై భారం



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగన్ విధానాలనే చంద్రబాబు అమలు చేస్తూ విద్యుత్ ట్రూఅఫ్ చార్జీలపై పేరుతో ప్రజలపై భారాలు మోపారని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు, అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. చలమయ్య మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు కరెంట్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.6072 కోట్ల భారం మోపారని, జనవరి నుండి మరో 9414 కోట్ల భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. అదానీ అవినీతి అక్రమాలపై అమెరికాలో కేసు నమోదైనా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నోరు మెదపటంలేదని విమర్శించారు. ప్రజలంతా ఏకమై స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయటం లేదని విమర్శించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్, నాయకులు కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, జి.బాలకృష్ణ, ఎం.నరసింహారావు, సిపిఐ నాయకులు ఇర్మియా, ఎంఆర్‌పిఎస్ నాయకులు కె.అశోక్ డిబిఎఫ్ నాయకులు ఎన్.చిట్టిబాబు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డి.కోటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజని, పట్టణ కార్యదర్శి ఎం.జ్యోతి, నాయకులు జి.ఉమశ్రీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

ఆదానికి మేలు చేయడానికి ప్రజలపై భారాలు మోపడానికి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ విమర్శించారు. విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరిట వేసే భారాన్ని ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగించటం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని 4, 5 వార్డుల్లో విద్యుత్ బిల్లులను





స్థానిక ప్రజలతో కలిసి దహనం చేశారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కరెంట్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీతో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి మాటను తప్పిందన్నారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి బి.మహేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ధర రూ.10-15 వేల వరకు కూడా వినియోగదార్ల నుండే వసూలు చేస్తారని, రాత్రి సమయంలో విద్యుత్ వాడకానికి ఎక్కువ రేటు, పగటి వేళల్లో మరో రేటుతో మరింత భారం మోపుతారన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నం, శోభన్‌కుమార్, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ఇందిరా నగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి మసీద్ సెంటర్లో పెరిగిన విద్యుత్ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు ఎస్.కె రంజాన్ బి, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేదలు ఇబ్బందులు పడుతుంటే ములిగే నక్కపై తాటికాయ పడ్డట్లు విద్యుల్ బిల్లులు పెంచుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎం.తిరుమల లక్ష్మి, నాసర్ బి, శివరామకృష్ణ, మదార్‌బి పాల్గొన్నారు.



గుంటూరు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వివిధ సంఘాల నాయకులు


పొనుగుపాడులో

అమిత్‌షాను పదవి నుండి బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అవమాన పరుస్తూ మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాను పదవి నుండి తొలగించాలని కోరుతూ గురువారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే తాను ప్రధాని అయ్యానని ఎన్నికల్లో చెప్పిన మోడీ ఎన్నికలు అయ్యాక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ఇప్పుడు ఏకంగా అంబేద్కర్‌పైనే అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. బిజెపి ద్వంద్వ నీతిని ప్రజలు గ్రహించాలని కోరారు. రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వారే నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడమే కాకుండా, రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నాయకులు జి.లూథర్‌పాల్, బి.ముత్యాలరావు, అంబేద్కర్ యూత్ ఆర్గనైజేషన్ నాయకులు సముద్రాల చిన కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం. కిరణ్, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ నాయకులు వేము భగవాన్‌దాస్, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు జి.శంకరరావు తదితరులు ప్రసంగించారు.


సుందరయ్య నగర్‌లో నిరసన...

స్థానిక 41వ డివిజన్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై సిపియం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపియం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు, స్థానిక శాఖ కార్యదర్శి జి.లూదర్‌పాల్ మాట్లాడుతూ అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆయనను మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆది నికల్సన్, షేక్ మస్తాన్వలి, ఆంజనేయులు, పద్మ, నూర్జహాన్, సుకన్య, బేబీ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు సుందరయ్య నగర్‌లో నిరసనలో నాయకులు

ఫిరంగిపురం : పొనుగుపాడు గ్రామంలోబి.ఆర్. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిహెచ్ మోహన్ బాబు,పీ. మధుసూదన్ రావు, టీ పెద్ద లక్ష్మయ్య, జి కోటేశ్వరరావు, జోజి బాబు, సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం మాట్లాడుతూ అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ చైర్మన్ రామనాథ పూర్ణచంద్రరావు, జిల్లా కాపు సంఘం చైర్మన్ రెమినిశెట్టి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె జాన్ బాబు, ఎం శ్రీనివాస్ కుమార్, ఏలే హనుమంతరావు, దామర్ల మల్లేశ్వరరావు, దామర్ల వీరప్రసాద్, బి.సమర్పణ కుమార్, చిలక కార్తీక్, సోమ శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో

కార్మిక నేత బిటి రణదివేకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

భారత దేశంలో కార్మిక ఉద్యమ నిర్మాణానికి, విశాల ప్రాతిపదికన కార్మిక వర్గాన్ని ఐక్యం చేయటానికి కార్మికనేత బి.టి.రణదివే విశేషమైన కృషి చేశారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. బి.టి.రణదివె 120వ జయంతి సందర్భంగా పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి రమాదేవి, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ కష్టజీవుల విముక్తికి సోషలిస్టు సమాజం రావాలని, సోషలిస్టు సమాజ సాధనలో కార్మిక వర్గం నాయకత్వం వహించాలని ఆకాంక్షించి, కార్మిక వర్గ ఐక్యత కోసం రణదివె పెద్ద ఎత్తున కృషి చేశాడన్నారు. కార్మికవర్గ ఐక్యతలో శ్రామిక మహిళలకు గల ప్రాముఖ్యతను ఆయన పదే పదే ప్రస్తావించే వారన్నారు. చారిత్రాత్మక బొంబాయి రైల్వే పోరాటం, ఇతర అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. బిజెపి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రణదివె


రణదివె చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

స్ఫూర్తితో పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, కోశాధికారి ఎం.సాంబశివరావు, ఉపాధ్యక్షులు షేక్.హుస్సేన్‌వలి, జిల్లా కార్యదర్శులు ఎన్.శివాజీ, బి.లక్ష్మణరావు, టివిజి రవిశంకర్, ఎం.భాగ్యరాజ్, ఎన్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

సుందరయ్య నగర్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ లీలా సుందరయ్య వేదికపై ఐద్వా, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు పౌలు, సుధాకర్ మాట్లాడుతూ ఒకరికి ఒకరు స్నేహం, మంచి నడవడికతో ముందుకు సాగవలసిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. బాల బాలిక లు ప్రదర్శించిన కళారూపాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మాలకొండ రెడ్డి ట్రస్ట్ కన్వీనర్ ఎస్ వెంకట్రావు, ఐద్వా నాయకులు యష్ గిరిజ, ప్రజా నాట్యమండలి నాయకులు కొట్టే కరుణాకర్ రావు, ఎస్ కే భాష, కే ప్రభాకర్, కొండబాబు, బేబీ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించండి.. క్షేమంగా గమ్యం చేరండి


అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు ప్రమాదాల్లో ఎవ్వరూ చనిపోకుండా ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని గుంటూరు ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్‌లు ధరించి నగరంలో ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని ట్రాఫిక్ డిఎస్‌పి రమేష్ తెలిపారు. ట్రాఫిక్ సిఐ సింగయ్య, ఎస్ఐలు రవీంద్రబాబు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. వాహనాల తనిఖీలో భాగంగా హెలిమెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న 70 ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించినట్టు సిఐ సింగయ్య తెలిపారు.

ఉపాధ్యాయులకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : ఫౌండేషన్ ఆఫ్ లిటరసీ, న్యూమరసి ప్రోగ్రామ్‌లో భాగంగా మూడురోజులపాటు జరిగే జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైంది. ఈ శిక్షణను పాఠశాల విద్య ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ జాతీయ విధానం ప్రకారం 3 నుండి 5 సంవత్సరాల పిల్లలకు ఆటపాటల ద్వారా సమగ్రాభివృద్ధిని అందించటమే ఈ శిక్షణ ఉద్దేశమని చెప్పారు. సమగ్ర శిక్ష ఎపిసి జి.విజయలక్ష్మి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అను గుణంగా విద్యాబోధన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు ఎంఇఒ అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతికిరణ్, పాఠశాల హెచ్ ఎం యండి.ఖాసిం, సమగ్ర శిక్ష సిఎంఒ అనిల్, పరిశీలకులు సూరిబాబు, వివిధ మండలాల నుండి డిఆర్‌పిలు పాల్గొన్నారు.



ప్రారంభసభలో మాట్లాడుతున్న ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి



విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని బిల్లుల దహనం

ప్రజాశక్తి-తాడేపల్లి

సర్దుబాటు చార్జీల పేరుతో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ గురువారం పట్టణంలోని రామయ్య కాలనీ, ముగ్గు రోడ్డు, మహానాడు ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ పెంచిన చార్జీలు తగ్గించకపోతే బాధిత ప్రజానీకాన్ని కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సందర్భంగా పెంచిన కరెంటు బిల్లులను దగ్ధం చేశారు. ముగ్గు రోడ్డులో జరిగిన కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. మహానాడు లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వి శాస్త్రి, రమణ, వెంకన్న, ఇక్బాల్, దర్శనపు విజయ్ బాబు, కే బాబురావు, లీలమ్మ, గోపమ్మ, ఫిరోజ్, శ్రీనివాస్ రావు, ఎల్ సత్యం, ఏడి గఫర్, ఆశ, ఎస్ కే భాష, సల్మాన్, ఆస్మా వహీదా, జుబేరా పాల్గొన్నారు.



ప్రజాశక్తి - తాడేపల్లి : పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను సిపిఎం ఆధ్వర్యంలో రాజధాని ముఖ ద్వారం అయిన ఉండవల్లి అమరారెడ్డి నగర్ లో గురువారం సిపిఎం నేతలు, మహిళలు దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని రవి కోరారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు సిపిఎం నాయకులు తుమ్మపూడి శివయ్య పి గాంధీ వి మస్తాన్రావు ఓలేటి చెంచయ్య ఎస్ భద్రయ్య రాములు స్థానిక మహిళలు శివపార్వతి అరుణ శివమ్మ భారతి జయమ్మ సాయమ్మ రజిని చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి మంగళగిరి , తెనాలి రూరల్, ఫిరంగిపురం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ గురువారం మంగళగిరిలో గోపాలకృష్ణ సెంటర్లలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, సిపిఎం పట్టణ నాయకులు టి శ్రీరాములు, స్థానిక నాయకులు ఈ కొండయ్య, టి బాలాజీ, పి పెద్దింట్లమ్మ, టి వాసంతి, జి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు. తెనాలిలో స్థానిక సుందరయ్య కాలనీలో సిపిఎం నాయకులు గురువారం విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, కెబి ప్రసాద్, కె రవికుమార్, షెట్టి యేసోబు తదితరులు పాల్గొన్నారు. ఫరంగిపురం మండలం తక్కెళ్ళపాడులో సచివాలయం వద్ద మార్పుల వెంగల్రెడ్డి శిలపాక సాంబశివరావు నాయకత్వంలో విద్యుత్ బిల్లులు దహనం చేశారు.



సైబర్ వలలో చిక్కుకోవద్దు..

ప్రజాశక్తి - మాచర్ల
మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా హాజరైన విజయపురి ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ, నరసరావుపేట ఎస్‌డిపిఒ సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆన్‌లైన్ పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలకు విజయశ్రీ

ప్రజాశక్తి-ఈపూరు



మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని ఎం.విజయశ్రీ ఈ నెల 17, 18వ తేదీలలో నరసరావుపేట పట్టణంలోని విక్టరీ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీలలో పాల్గొని సత్తా చాటిందని. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టులో స్థానం పొందినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, ఎం.దాస్, సిహెచ్ అరవింద్, కె.వంశీ తదితరులు అభినందించారు.



కల్తీ విత్తనాలు వచ్చాయని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-పెదకూరపాడు
పూత, పిందె వస్తుంది గానీ.. కాయ అవ్వడం లేదని మండలంలోని రైతులు ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. గురువారం పలు ప్రాంతాల్లో మిరప తోటలను ఉద్యానవన శాఖ అధికారి నిత్యశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి శాంతి సిబ్బందితో కలిసి పరిశీలించారు. 9211 విత్తనానికి సంబంధించి 303 లాట్ నెంబర్‌లో పూత, పిందె వస్తున్నాయని.. కాయ కావడం లేదని రైతులు తెలిపారు.

మిరపలో బొబ్బర, జెమినీ వైరస్ తెగులు

ప్రజాశక్తి - వెల్దుర్తి
మిరపలో బొబ్బర, జెమినీ వైరస్ తెగులు వ్యాపిస్తోందని, రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లిమాచర్ల ఉద్యాన అధికారి ఎన్.సురేష్ తెలిపారు. మండలంలోని మండాది, రచ్చమల్లపాడు మిరప పంట పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులకు

వేతనాలు అందేదెప్పుడు?

ప్రజాశక్తి - చిలకలూరిపేట
పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కొద్ది నెలలుగా వేతనాలు అందడం లేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులకు సుమారు జూన్ నెల ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వారంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రం చేయడానికి ఫినాయిల్, చీపుర్లు, ఇతర సామగ్రికి కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని కార్మికులు వాపోతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 110 మంది పారిశుధ్య కార్మి కులు పని చేస్తున్నారు. రోజుకు మూడు సార్లు మరుగుదొడ్లను శుభ్రం చేయడం వీరి విధి. పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచడం.. బ్లీచింగ్ చల్లడం తదితర పనులు వీరి ముఖ్య విధుల్లో భాగం. కార్మికులకు నెలకు రూ.6 వేల చొప్పున వేతనాన్ని గత వైసిపి ప్రభుత్వం చెల్లించేది. చాలీచాలని వేతనాలతో తమ జీవనం కొనసాగిస్తున్నామని.. ఆరేడు నెలల నుంచి ఆ మొత్తం కూడా రావడం లేదని వారు చెబుతున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం వడ్డీలకు అప్పు తెచ్చుకొని జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాజహితం కాంక్షించే క్రీస్తు బోధనలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట
క్రీస్తు బోధనలు సమాజం అభివృద్ధి చెందడానికి, శాంతి స్థాపనకు దోహదం చేస్తాయని స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల మందికిపైగా దళితులు ఉన్నారని.. వారందరినీ ఆర్థికంగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజా రమేష్, టిడిపి నాయకులు నెల్లూరి సదా శివరావు, షేక్ కరిముల్ల, పఠాన్ సమద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే నంబర్లను సవరణ చేయాలని వినతి

ప్రజాశక్తి - దాచేపల్లి
దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని దాచేపల్లి, నారాయణపురం, ఇరికేపల్లి గ్రామాల్లో 22ఏగా ఉన్న సర్వే నంబర్లను సవరణ చేయాలని కోరుతూ గురువారం దాచేపల్లి నగర పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 14వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే షరీఫ్ అర్జీ అందజేశారు. గతంలో దాచేపల్లి గ్రామపంచాయతీగా, నడికుడి పంచాయతీగా ఉన్నప్పుడు దాచేపల్లిలోని కొన్ని సర్వే నంబర్లను 22ఎ జాబితాలో ఉన్న సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్లు చేసుకొని ఇళ్లు నిర్మాణం చేసుకున్నారని వివరించారు. దీనికి పంచాయతీ కార్యాలయం నుంచి అప్రూవల్ కూడా వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం దాచేపల్లి, నడికుడి గ్రామపంచాయతీలను కలుపుతూ నగర పంచాయతీగా ఏర్పడిన తర్వాత 22 ఏ లో ఉన్న సర్వే నెంబర్లను రెడ్ మార్కుల్లో పెట్టి ఉన్నారని తెలిపారు. సదరు సర్వే నెంబర్లు ఉన్న భూమిని గ్రామం పుట్టినప్పటి నుంచి గృహ సముదాయాలు కలిగి ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలన చేసి 22 ఏ లో ఉన్న సర్వే నెంబర్లు సవరణ చేసినట్లయితే తద్వారా నగర పంచాయతీకి ఆదాయం చేకూరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ త్వరలోనే రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు అన్నిటిని పరిశీలించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తంగడ మేజర్ డిసి చైర్మన్ పగడాల భాస్కరరావు, దాచేపల్లి మండల మాజీ ఎంపిపి అంబటి శేషగిరిరావు, మాజీ సర్పంచ్ ఎస్ కె వలి, వేముల కృష్ణతోపాటు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో నెమిలి రెడ్డి, ఆర్ఐ శరత్, వీఆర్వోలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పేదల భూముల ఆక్రమణపై

చర్యలు తీసుకోవాలి : శ్రీనునాయక్

ప్రజాశక్తి - నాదెండ్ల
నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందినటువంటి వైసిపి నేత సింగారెడ్డి కోటిరెడ్డి పేదల భూములను ఆక్రమించారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన ఎస్టీ యానాది సామాజిక వర్గానికి చెందినటువంటి 11 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వాలు 13.40 సెంట్ల వ్యవసాయ భూమి ఇచ్చిందని.. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని, నిలువునా మోసగించారని విమర్శించారు. శుక్రవారం సదరు వ్యవసాయ భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగారెడ్డి కోటిరెడ్డి, కుమారులు కబంధహస్తాల్లో వ్యవసాయ భూమి ఉందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి విడదల రజిని అండదండలతో సదరు లబ్ధిదారుల దగ్గర ఉన్నటువంటి భూమిని కౌలుకు ఇచ్చుకొని, ఆ నగదును అనుభవిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారుల విచారణ ప్రారంభం కావడంతో స్టాంప్ పేపర్లపైన లబ్ధిదారులకు సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయడమే కాక, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఎస్టీల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నాయకులు నేలం యేసు రాజు, ప్రత్తిపాటి, బి.రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



'పెనుగొండ'కు అవార్డు ప్రశంసనీయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
ప్రముఖ అభ్యుదయ రచయిత, న్యాయవాది, కవి, విమర్శకులు పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అవార్డుకు ఎంపికవడం పల్నాడు జిల్లా సాహితీ లోకానికి గర్వకారణమని ఏపీ అశ్లీలత ప్రతి ఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఈదర గోపీచంద్ అన్నారు. పెనుగొండ.. బహుముఖ ప్రజ్ఞాశాలి అని , అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో చురుకైన కార్యకర్త అని కొనియాడారు. 1989లో అశ్లీలతా ప్రతిఘటన వేదిక ఏర్పాటులోనూ, నటి సిల్క్ స్మిత డాన్సులను ప్రతిఘటించడం, గ్రంథాలయాలలో అశ్లీల నవలలు నిషేధం వంటి కార్యక్రమాలలో కీలక పాత్ర పోషించారని చెప్పారు.

'బాసట' ట్రస్టు ఏర్పాటు

ప్రజాశక్తి - యడ్లపాడు
సుమారు తొమ్మిదేళ్లగా విజన్ ఫౌండేషన్-లింగారావుపాలెం, యడ్లపాడు అభివృద్ధి కమిటీ పేర్లతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఉచిత వైద్యశిబిరాలు, వేసవి శిక్షణ శిబిరాలు, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు. తమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు బాసట(సామాజిక సాంస్కృతిక వేదిక) పేరుతో ట్రస్టును ఏర్పాటు చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఇప్పటి వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలతోపాటు.. పర్యావరణహితమైన కార్యక్రమాలు చేపడుతూ, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే పౌరులను కలుపుకొని సామాజిక సాంస్కృతిక వేదికను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. 23 మంది సభ్యులతో ఈ వేదికను ప్రారంభించారు.



జనసేన కార్యకర్తకు రూ.50 వేల చెక్కు అందజేత

ప్రజాశక్తి - విజయపురిసౌత్
ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డ మాచర్ల మండలం జమ్మల మడక గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కుర్రాకుల నాగేశ్వరరావు కు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు గుంటూరులోని జనసేన పార్టీ కార్యాలయం లో రూ.50 వేల చెక్కు ను గురువారం అందజేశారు.జనసేన అధినేత,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 50 వేల రూపాయల చెక్కును బాధిత కార్యకర్తకు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు.ప్రమాద బీమా పొందేందుకు జనసేన కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాచర్ల మండల జనసేన అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నేడు నిరసన

ప్రజాశక్తి - మాచర్ల : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల, గ్రామ స్థాయి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

నేడు మంగళగిరిలో మంత్రి లోకేష్ పర్యటన

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ పర్యటించనున్నారు. ఉదయం 9.30 నిమిషాలకు మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జరిగే సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. 10 గంటలకు మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో ఆర్ఆర్ టవర్లో విజయ డిజిటల్ షో రూమ్ ని ప్రారంభిస్తారు. సాయంత్రం 6:30 గంటలకు మంగళగిరి పట్టణంలో బాప్టిస్ట్ పేట వద్ద ఏర్పాటుచేసిన క్రిస్మస్ స్టార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్లో జరిగే సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు.



ముగిసిన సుస్థిరాభివృద్ధి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- చేబ్రోలు

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద గ్రామాల సుస్థిరాభివృద్ధిపై నాలుగు రోజుల శిక్షణ కార్యమ్రం గురువారంతో ముగిసింది. ముగింపు కారక్రమంలో ఈవోపీఆర్డీ టి.ఉషారాణి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి తొమ్మిది అంశాలను గ్రామాల్లో సాధించినట్లయితే కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ప్రకటించి నగుద ప్రోత్సాహకం అందిస్తుందని చెప్పారు.

'విలువలతో కూడిన ఉద్యమాలు ధర్మారావు సొంతం'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ జన్మదిన వేడుకలను గురువారం కొలకలూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, తంగిరాల ప్రవీణ్ తమ అభిమాన నాయకుడికి ఘనంగా సత్కరించి కేక్ కోయించారు. నిర్వహించారు. మాదిగల కోసం జైలు జీవితం గడిపిన వ్యక్తి ధర్మారావు మాదిగ అని కొనియాడారు. విలువలతో కూడిన ఉద్యమాలు చేసిన వ్యక్తిని జాతి గుర్తించుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఉన్నం సుధీర్, ఉన్నం గోపి, కూచిపూడి కిరణ్, ఉన్నం ఉమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మ) ఆధ్వర్యంలో శుక్రువారం అర్బన్ మార్కెట్ నిర్వహిస్తున్నట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిర్వహించే అర్బన్ మార్కెట్ లో మెప్మా మహిళలు సొంతంగా తయారు చేసిన గృహోపకరణాలు, తినుబండారాలు, చేతి అల్లికలు చౌక ధరలకు లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని కోరారు.

కేఎల్‌యూలో భౌతికశాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం అధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన పలువురు భౌతిక శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు కెఎల్ భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న చైర్మన్ కాగా, డాక్టర్ ఎస్.షణ్ముగన్ కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు. ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, ఎఫ్ ఇడి ప్రిన్సిపల్ డాక్టర్ కష్ణారెడ్డి, ముఖ్య అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఇశ్రాయేలు దేశానికి చెందిన ఎరియల్ యూనివర్శిటీ పరిశోధకులు డాక్టర్ కె.చిన్నయ్య , అమెరికా నుండి ప్రసాద్ జలాది లతో పాటు దక్షిణ కొరియా తదితర దేశాల నుండి పరిశోధకులు భౌతిక శాస్త్రంలోని నానో టెక్నాలజీ గురించి వివరించారు. సదస్సు చైర్మన్ డాక్టర్ కె.స్వప్న మాట్లాడుతూ విద్యుత్ నిల్వలకు నానో టెక్నాలజీ సామర్థ్యం, మెరుగుపరచడంపై పరిశోధనలు దానిపైన చర్చలను ప్రోత్సహించడం ఈ సదస్సు లక్ష్యమని వారు తెలిపారు. నానోటెక్నాలజీ పాత్రపై దష్టి సారించడం ద్వారా అధునాతన సూక్ష్మ పదార్థాలను ఉపయోగించి బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు వంటి విద్యుత్ నిల్వ వ్యవస్థల పనితీరు మరింత స్థిరమైన శక్తి నిల్వ పరిష్కారాలకు దోహదపడే ఆవిష్కరణలను నడపడం లక్ష్యమని పేర్కొన్నారు. కన్వీనర్ డాక్టర్ ఎస్.షణ్ముగన్ మాట్లాడుతూ ప్రపంచ ఇంధన సవాళ్లను పరిష్కరించేటప్పుడు పర్యావరణం పై దుష్ఫలితాల ప్రభావాన్ని తగ్గించే స్థిరమైన సూక్ష్మ పదార్థాలను అభివృద్ధి చేయడం, ప్రాముఖ్యత గురించి అవగహన కల్పించారు. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, విద్యుత్ -సమర్థవంతమైన సాంకేతికతలకు దోహదపడే సూక్ష్మ పదార్థాల సంభావ్యతపై దష్టి సారించడం, వాతావరణ మార్పుల లక్ష్యాలతో పరిశోధన ప్రయత్నాలను సమలేఖనం చేయడమని అన్నారు. విద్యుత్ నిల్వ సాంకేతికతలలో నానో మెటీరియల్స్ యొక్క కొత్త పురోగతులు, ఆచరణాత్మక అప్లికేషన్లు వంటివి వివరించారు.

నేడు గుంటూరు కౌన్సిల్ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరగనుంది. ఈ సమావేశానికి మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో టిడిపి, వైసిపి మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగే అవకాశం ఉంది. వైసిపి హయంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టిడిపి, టిడిపి హయంలో ప్రొటో కాల్ పాటించడం లేదని, ప్రభుత్వ తీరు జరిగా లేదని వైసిపి విమర్శలు గుప్పించుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. దాదాపు కౌన్సిల్ సభ్యులు 90కి పైగా ప్రశ్నలు పంపారు. ఈ ప్రశ్నలు, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలతో సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే అవకాశం ఉంది. టిడిపి, వైసిపి సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు అధికారులు సన్నద్ధం అయ్యారు.

ఒత్తిడి వల్లే ఉపాధ్యాయులకు ప్రమాదాలు


ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి విషయానికీ ఉపాధ్యాయులనే బాధ్యులను చేయటం, బోధనేతర పనులు పెంచి క్షణాలలో జరిగిపోవాలని ఒత్తిడి చేయడం వల్ల ఉపాధ్యాయులు మానసిక ఆందోళనతో ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, యం.కళాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు పక్కనే ఉన్న తలుపులపల్లి జెడ్పీ హైస్కూల్ బయాలజీ సైన్స్ ఉపాధ్యాయుడు సిద్దయ్య శెట్టి మరణానికి యుటిఎఫ్ నాయకులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని, ఏ చిన్న లోపం జరిగినా ఉపాధ్యాయులను సస్పెండ్ చేయటం మానుకోవాలన్నారు. ఒక సంఘటన మరిచిపోక ముందే మరొక సంఘటన జరగటం ఉపాధ్యాయులు బలైపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తుందని అన్నారు.

వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని ముఖద్వారం ఉండవల్లి మరియు పక్కనే ఉన్న తాడేపల్లి పట్టణంలో చైన్ స్నాచర్స్‌తో పాటు దొంగలు చెలరేగిపోతున్నారు. స్వయానా ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న ఉండవల్లిలో ఎలాంటి భయము, బెరుకు లేకుండా బుధవారం తెల్లవారుజామున నాలుగు వాహనాల్లోని బ్యాటరీలు దొంగలు ఎత్తుకుపోయారు. అవి అమ్ముకుంటే దొంగలకు వచ్చేది పదివేల రూపాయలు మాత్రమే. వాహనాల యజమానులు కొనుగోలు చేయాలంటే ఒక్కొక్కరికి 20 వేల నుండి 30 వేల ఖర్చవుతుందని బాధితులు వాపోతున్నారు. బుధవారం రాత్రి తాడేపల్లి పట్టణంలోని 17 వార్డులో రైల్వే బ్రిడ్జి సమీపంలో ఓ కారులోని అద్దాలు పగలగొట్టి టేప్ రికార్డర్ ను దొంగలు ఎత్తుకుపోయారు. జరిగిన ఘటనలపై ఎప్పటికప్పుడు బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. దొంగలపై విచారణ సరిగ్గా సాగటం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల తాడేపల్లి పట్టణంలో వరుసగా చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నలుపు రంగు పల్సర్ బైక్ పై వస్తున్న ఇద్దరు అగంతకులు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతంలో


వాహనంలో బ్యాటరీ చోరీ

ఉండవల్లి సెంటర్లో ఇటువంటి ఘటనలు ఎక్కువగా జరిగేవి. ప్రస్తుతం అవి తాడేపల్లి విస్త రించాయి. సంవత్సరాల నుండి చైన్ స్నాచింగ్ లు జరుగుతున్న ఇంతవరకు దొంగలను పట్టుకోలేకపోవటం కూడా పోలీసులు తీరుపై విమర్శలు వస్తున్నాయి. మహిళల మెడలోని గొలుసులు తెల్చుకొని అగంతకులు కెఎల్ యూనివర్సిటీ రోడ్డు వైపు వెళ్తున్నారని చూసినవారు చెబుతున్నారు. ఆ దిశగా పోలీసు ఉన్నతాధికారులైన జోక్యం చేసుకొని గట్టి నిఘ ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

ఫ్లాగ్‌డేలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్: అనాథ నిరుపేద పిల్లలకు, హింసకు గురైన వారికి శారీరక, మానసిక మద్దతుకోసం తెనాలి ఎన్సిసి అధికారులు ఆధ్వర్యంలో గురువారం ఫ్లాగ్ డే నిర్వహించి విరాళాలు సేకరించారు. ఎన్సిసి 22వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి ఎ ఉదయ్ కుమార్ ఆదేశాలనుసారం తెనాలి పట్టణంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎన్సిసి విద్యార్థులు కలిసి విరాళాల రూపంలో పెద్ద మొత్తం సేకరించినట్లు తెనాలి బాయ్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి తెలిపారు. వచ్చిన విరాళాలను సుబేదార్ అవతార్ సింగ్ కు అందజేసినట్లు తెలిపారు. ప్రజల మధ్య సౌభ్రాతత్వాన్ని రూపొందించడానికి అలాగే మతసామరస్యాన్ని, జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు ఈ విరాళాలను ప్రతి ఏడాది సేకరిస్తున్నట్లు ఎన్సిసి అధికారి పరిశా సర్దార్ వివరించారు. ప్రతి ఏడాది ఫండ్ రైజింగ్ వీక్ ద్వారా నేషనల్ కౌన్సిల్ ఫర్ కమ్యూనల్ హార్మోని సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-చేబ్రోలు : మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తన్నీరు రవీంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా గురువారం నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర, విద్యానగర్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం గురువారం చేపట్టారు. కార్యక్రమంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమా శంకర్ పాల్గొన్నారు.



భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-పెదనందిపాడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ గ్రామ సదస్సులు గురువారం పెదనందిపాడు మండలం పుసులూరు గ్రామంలో నిర్వహించినట్లు మండల తహసీల్దార్ పి.శంకర్ బాబు తెలిపారు. ఈ సదస్సులో మొత్తం 27 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలపై వెంటనే పరిశీలన చేపట్టి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను అవసరమైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సాహితీ మోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, దేవాదాయ ఈవో శ్రీనివాసరావు, ఎస్ ఆర్ ఓ సీనియర్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ తదితరులు హాజరయ్యారు.

కొల్లిపర : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వము రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తాసిల్దార్ సిద్ధార్థ తెలిపారు గురువారం కొలిపర మండలంలోని తోట గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు ఈ సభలో పొలము సర్వేకు సంబంధించి పది అర్జీలు రెవిన్యూ కి సంబంధించి 8 అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ తెలిపారు ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ మురళీకష్ణ ఎండోమెంట్ ఆఫీసర్ పద్మావతి, వీఆర్వో గ్రామస్తులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - తాడికొండ

సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తాడికొండ సీఐ కె.వాసు అన్నారు.గురువారం తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద నుంచి బడేపురం రోడ్ వరకు చలపతి కళాశాల, బిఎస్ఎస్‌బి కళాశాల విద్యార్థులతో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు పట్ల విద్యార్థులు,అధ్యాపకులు, ప్రజలు జాగ్రత్త వహించి మోసాల బారినుండి కాపాడుకోవాలని సూచించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత సమాచారం తో సైబర్ నేరాలకు మోసగాళ్లు పాల్పడుతున్నారని అన్నారు.బ్యాంక్ ఆన్లైన్ మోసాలు, సోషల్‌మీడియా, ఫోన్ కాల్స్, ఆన్లైన్ లింకులు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ లు, జోజి, జీత్యా నాయక్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కాకుమాను శంకరుని వర్ధంతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి బోస్ రోడ్డులో కాకుమాను శంకరుని ధర్మసత్రంలో గురువారం శ్రీ కాకుమాను శంకరుని 108వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్రం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు కాకుమాను శరత్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెనాలి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎస్ శారద దేవి, కార్యనిర్వహణ అధికారి తమ్మ శివారెడ్డి, ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ. 2 వేల చెక్కును అందజేశారు. అనంతరం నిరుపేదలకు వస్త్ర దానం, దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు, సుమారు 600 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

చలపతి ప్రిన్సిపల్‌కు సీనియర్ సైంటిస్ట్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ రామారావు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు సీనియర్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. మూడు ఉత్తరప్రదేశ్ అలీఘర్ మాంగల్యతాన్ యూనివ ర్సిటీలో జరిగిన 18వ వార్షికోత్సవ అంతర్జాతీయ సమావేశంలో అసోసియే షన్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఫార్మసీ వారు అవార్డును అందచేశారు. జార్కండ్ ఉషామార్టిన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మధులికా కౌశిక్, యుఎస్‌ఎలోని యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ జార్జియా డైరెక్టర్ ప్రొఫెసర్ స్వామి మృతినిటి, మాంగల్యతాన్ యూనివర్సిటీ వీసీ కెఆర్‌ఎస్ సాంబశివరావు చేతులమీదుగా అవార్డు అందచేశరాఉ. అవార్డు అందుకున్న సందర్భంగా చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందించి మాట్లాడుతూ ఫార్మా విద్యారంగంలో, పరిశోధనలో సుదీర్ఘ అనుభవం కలిగి, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన రామారావుకు అశార్డు దక్కటం ఫార్మా విద్యకు గర్వకారణంగా ఉందన్నారు. గతంలో ప్రొఫెసర్ ఎంఎల్ ఖోరానా మెమోరియల్ అవార్డు, స్కోర్ మోర్ ఫౌండేషన్ నుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సహా పలు అవార్డులు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు రామారావును అభినందించారు.



లావు రత్తయ్యతో మడగాస్కర్ ప్రతినిధులు

విజ్ఞాన్స్ వర్సిటీని సందర్శించిన మడగాస్కర్ ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

భారత్-మడగాస్కర్ దేశాల మధ్య విద్య, పరిశోధనలు, వ్యవసాయ రంగంలో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని మడగాస్కర్ మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పెడగాజి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జ్ రావోనిహెరిజఓనా ఆండ్రియామియాకట్సిలావో అన్నారు. మడగాస్కర్‌కు చెందిన 14 మంది ప్రతినిధుల బృందం గురువారం యూనివర్సిటీని సందర్శించింది. ఈ సందర్భంగా ఆండ్రియామియాకట్సిలావో మాట్లాడుతూ తమ దేశంలో విద్యావకాశాలను మెరుగుపరచడం, సాంస్కృతిక మార్పిడిని సులభం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విజ్ఞాన్ ప్రొఫెసర్లు మడగాస్కర్‌కు వచ్చి బోధనా నిపుణులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు రెండు దేశాల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, జ్ఞాన మార్పిడి నిర్వహించడాన్ని సులభతరం చేస్తాయన్నారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మడగాస్కర్ ప్రభుత్వానికి పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సమర్థమైన కరిక్యులం సృష్టించడంలో సహాయం, బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం, ఆధునిక ఆన్‌లైన్ బోధనా విధానాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాసంస్థలను ఏర్పాటుచేసే దిశగా మార్గదర్శకం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ప్రసంగించారు. మడగాస్కర్ ప్రతినిధులు పర్యటనలో భాగంగా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ దత్తత గ్రామాలైన వేజెండ్ల, సంగం జాగర్లమూడి ప్రభుత్వ పాఠశాలలు, గుంటూరులోని ఎల్ఐసి కాలనీ విజ్ఞాన్ హైస్కూల్, విజ్ఞాన్ నిరుల పలు విద్యా సంస్థలను సందర్శించారు.కార్యక్రమంలో మడగాస్కర్‌లని మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాండ్రియానరివో హసినైనా రిచర్డ్, మాస్ అండ్ సివిక్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫియాంగో మానపోక్ జుడిత్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీపూజిత స్కూల్లో యల్లో కలర్‌డే

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో గురువారం ఎల్లోకలర్‌డే వేడుకలు నిర్వహించారు.చిన్నారులలో పసుపు రంగు దుస్తులు ధరించి, క్లాసు రూమ్‌లను పసుపు రంగు బెలూన్లతో అలంకరించారు.పసుపురంగు కాయలు, కూరగాయలను ప్రదర్శించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ పసుపు రంగు అనేది స్పష్టత, సూర్యకాంతి రంగు అని, అది వ్యక్తిగత శక్తికి, పరిపూర్ణతకు, ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని తెలిపారు. యుగాల నుంచి కూడా పసుపు రంగు జ్ఞానానికి, తెలివికి ప్రతీకగా ఉందని చెప్పారు. అనంతరం చిన్నారులకు ర్యాంప్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంప్ మహిళా పాలిటెక్నిక్ కాలేజి

ముగిసిన బాలికల ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు



ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న జిపిడబ్ల్యూ కాలేజి విద్యార్థినులు

స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న బాలికల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం ముగిసింది. ఈ ఆటల పోటీల్లో అన్ని విభాగాల్లోనూ ఓవరాల్ చాంపియన్‌షిప్ ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజి కైవశం చేసుకుంది. స్పోర్ట్స్‌లో వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను కళాశాల ఈసీఈ బ్రాంచ్ విద్యార్థిని కె.నవ్య దక్కించుకుంది. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి విజేతలకు అవార్డులు అందించి అభినందించారు. క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాక్షించారు. పోటీలకు సహకరించిన నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్లు, పొన్నూరు పాలిటెక్నిక్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విజయ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించి ఖోఖో విన్నర్స్-మహిళా పాలిటెక్నిక్, వాలీబాల్ విన్నర్స్ సెయింట్ మేరీస్, బాడ్మింటన్ సింగిల్స్ విన్నర్స్ సాయితిరుమల కాలేజ్, బాడ్మింటన్ డబుల్స్ సెయింట్ మేరీస్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ విన్నర్స్ హిందూ కాలేజ్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ విన్నర్స్ మహిళా పాలిటెక్నిక్ గెలుపొందాయి. స్టాఫ్‌కు నిర్వహించిన పోటీల్లో విన్నర్స్ గా పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్, రన్నర్స్‌గా మహిళా పాలిటెక్నిక్ గెలుపొందారు.

వర్సిటీలో అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



క్రికెట్ పోటీలను ప్రారంభించిన రిజిస్ట్రార్ సింహాచలం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో అంతర కళాశాల క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఇన్చార్జి రిజిస్ట్రర్ ఆచార్య జి. సింహాచలం ప్రారంభించారు. రేపల్లెలోని సాధన డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలో ఉన్న 23 కళాశాలల జట్లు పాల్గొన్నాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆటవిడుపుగా క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. తద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, లక్ష్యం నెరవేర్చుకునే లక్షణాలు అలవర్చుకోవచ్చునని సూచించారు. వ్యాయామ విద్య డైరెక్టర్ పి.పి.ఎస్ పాల్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీలో క్రీడలకు ఆధునాతన సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఫార్మసీ కళాశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్ రిజిస్ట్రార్ సింహాచలం ప్రారంభించారు. ఈనెల 30 వరకు జరిగే ఈ పోటీలలో మొదటి రోజు విజేతలను ప్రకటించారు. పిఎఎస్ పెదనందిపాడు ఆర్ట్స్ కళాశాలపై ఏఎన్‌యు ఇంజనీరింగ్ కళాశాల,జెకేసీ కళాశాలపై ఏఎన్యూ సైన్స్ కళాశాల, ముప్పాళ్ళ ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలపై నాగార్జునసాగర్ లోని ఏపీఆర్ డి సి కళాశాల, మాచర్లలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలపై విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో గెలుపొందాయని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అపోహలు వద్దు..

విద్యుచ్ఛక్తిని పొదుపుగా వినియోగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలల్లో భాగంగా గురువారం కలక్టరేట్ నుండి నగరంపాలెం ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వరకూ నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జేసీ ఏ.భార్గవ్‌తేజతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఇంధన పొదుపుపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ 14 వ తేది నుండి 20 వ తేది వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించుకోవడం జరుగుతున్నదన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు వినియోగదారుల్లో, ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యుచ్ఛక్తిని పొదుపుగా వాడి భావితారాలకు ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. తక్కువ విద్యుత్ వినియోగంతోనే సమర్థవంతంగా పని చేసే గృహోపకరణాలను వినియోగించాలని సూచించారు. పియం సూర్య గృహ పథకం క్రింద జిల్లాలో ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు 5900 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఇప్పటికే 594 మంది ఇండ్లపై ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు.

48గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ

ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుపై మీడియా వారు అడిగిన ప్రశ్నకు కలెక్టర్ వివరణ ఇస్తూ ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు పది వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. 48 గంటల్లోపే ప్రభుత్వం పైకాన్ని రైతుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. తేమ శాతం ఎక్కువగా వున్నప్పటికి కొనుగోలు చేయడం జరుగుతున్నదన్నారు. తేమ శాతం ఎక్కువగా వుందని తిరస్కరించట్లేదని చెప్పారు. 17 శాతం తేమ వున్న ప్యాడీకి యంఎస్పీ ధర వస్తుందన్నారు. ప్యాడీ ఇవ్వడానికి సిద్దంగా వున్న వారి నుండి మాయిశ్చర్‌తో సంబంధం లేకుండా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి అపోహలు వద్దన్నారు. ప్రతి రైతు నుండి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షం వస్తుందనే కారణంగా ఇప్పటికే 350 టార్పాలిన్‌లను కొనుగోలు చేసి సిద్ధం చేయడం జరిగిందని , అవసరం వున్నవారు కోరితే వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ ఖాజావలి , ఎస్.ఈ ఆపరేషన్ ఏ.వి.ఎల్.ఎన్. మూర్తి , సీఆర్డీఏ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గురువారం గోరంట్ల టెన్త్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎంతటి సవాలునైనా అధిగమించవచ్చని, జీవితమంటేనే ఎన్నో సవాళ్లతో కూడుకొని ఉంటుందన్నారు. ఎదురయ్యే ప్రతి పరిస్థితిని సమయస్ఫూర్తితో అధిగమిస్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఉద్భోదించారు. ఈ దశలో మీ ఏకాగ్రతను సడలించే ఎన్నో పరిస్థితులు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కొని నిలబడినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షలు జీవితంలో కీలకమని, అందరూ పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.